# 6

## మతశాఖ కాని క్రైస్తవ్యం:

# ఏకీభావమునకు ఒకే ఆధారము

క్రొత్త నిబంధనలో దేవుని ప్రజలు ఏక హృదయము ఏకాత్మయు గలవారై ఉండాలని పరిశుద్ధాత్మ బోధిస్తున్నాడు. క్రీస్తునందు విశ్వాసులైన వారి మధ్యగల విభజనలు పాప భూయిష్టమైనవి, నిజమైన క్రైస్తవ్యానికి నాశనకరమైనవని ఎరుగనివారు, బైబిల్లో అతి స్పష్టంగా తెలుపబడిన వాస్తవాన్ని అలక్ష్యం చేస్తున్నారు. “సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు! ఎంత మనోహరము!” (కీర్తన. 133:1).

ప్రభువైన యేసు తన తండ్రికి యిలా ప్రార్థించాడు,

> మరియు నీవు నన్ను పంపితివని లోకము నమ్మునట్లు, తండ్రీ, నాయందు నీవును నీయందు నేనును ఉన్నలాగున, వారును మనయందు ఏకమైయుండవలెనని వారి కొరకు మాత్రము నేను ప్రార్థించుటలేదు; వారి వాక్యమువలన నాయందు విశ్వాస ముంచువారందరును ఏకమైయుండవలెనని వారికొరకును ప్రార్థించుచున్నాను. మనము ఏకమై యున్నలాగున, వారును ఏకమై యుండవలెనని నీవు నాకు అనుగ్రహించిన మహిమను నేను వారికి ఇచ్చితిని. వారియందు నేనును నాయందు నీవును ఉండుటవలన వారు సంపూర్ణులుగా చేయబడి యేకముగా ఉన్నందున నీవు నన్ను పంపితివనియు, నీవు నన్ను ప్రేమించినట్టే వారినికూడా ప్రేమించితివనియు, లోకము తెలిసికొనునట్లు నాకు అనుగ్రహించిన మహిమను వారికి ఇచ్చితిని (యోహాను 17:20-23).

తండ్రియు కుమారుడును ఏకమైయున్నట్టుగా లోకమందున్న ప్రతి విశ్వాసియు మరియొక విశ్వాసితో ఏకమైయుండాలి. క్రీస్తును నిజంగా ప్రేమించేవారందరును క్రీస్తు యొక్క ప్రజల ఏకత్వపు సిద్ధాంతానికి మార్చబడడానికి రక్షకుని యొక్క ఈ ప్రార్థన సరిపోవాలి. ప్రభువైన యేసు దీనికొరకు బహు తీవ్రమైన ఆపేక్షతో ప్రార్థించాడు. గనుక అది ప్రతి శిష్యునికి ప్రధానమైనదిగా ఉండాలి. ఈ ఆసక్తి ప్రతివాని హృదయంలో చాలా భారమైనదిగా ఉండాలి. ప్రత్యేకించి, ఈ ఐక్యతను ప్రభువు కోరడంలోని ఉద్దేశాన్ని ఒకడు ఎరగాలి. ప్రభువునందలి విశ్వాసుల మధ్య జరిగే విభజన ఘోరమైన పాపం. లోకం క్రీస్తునందు విశ్వాసముంచకుండ అడ్డుకొనడానికి మరి యే యితర పాపము అంతగా క్రియ చేయకపోవచ్చు.

పౌలు యిలా వ్రాశాడు: “సహోదరులారా, మీరందరు ఏకభావముతో మాటలాడ వలెననియు, మీలో కక్షలు లేక, యేక మనస్సుతోను ఏకతాత్పర్యముతోను, మీరు సన్నద్ధులై యుండవలెననియు, మన ప్రభువైన యేసుక్రీస్తు పేరట మిమ్మును వేడుకొను చున్నాను”

(1 కొరింథీ. 1:10). ఐక్యత కొరకు పరిశుద్ధాత్మ చేయు యిట్టి విన్నపములతో, మనమధ్య ఈలాటి పాపాన్ని విధేయతగల హృదయం, నిజమైన వ్యక్తిత్వం తేలికగా ఎలా తీసికోగలదు? ఇతర శిష్యులందరితో కలవడానికి పరిశుద్ధాత్మ స్పష్టంగా కోరనిదాన్ని వదలివేయాలని ఒకడు తెలుసుకోక తప్పదు. క్రైస్తవుల మధ్య విభజనను శాశ్వతంగా ఉండేటటువంటి మత సంబంధమైన ఆచరణను ఎంత కాలం నిలుపుతాడో అంత కాలం అతడు పాపభరితంగా దోషియని నిజంగా ఫీల్ అవ్వవలసిందే.

మత ప్రపంచంలో విభజనలు కొనసాగడానికి రెండు నిజమైన కారణాలున్నాయి. అందులో ఒకటేమంటే – అనేకమంది ప్రజలు – అందులో బాగా దైవభక్తి గల మనుష్యులు కూడా దానిని పాపంగా ఎంచలేదు, దాన్ని తేలికగా భావించి దాన్ని గూర్చి పట్టించుకోనే లేదు. మరో కారణమేమంటే – దైవ భక్తిగలవారనేకులలో, విభజనను గూర్చి తీవ్రంగా బాధపడతారు కాని, అది ఏనాటికి పరిష్కరింపబడలేని గాఢమైనదని దాన్ని వదిలేస్తారు. ప్రభువు బోధించేదాన్ని, ఆయన ఆజ్ఞాపించేదాన్ని తీసికొని రావాలని మాత్రమే ఈ రెండు రకాల్లో ఎవరూ ప్రయత్నించరు, అయితే రెండు రకాలవారు దేవునికి అవిధేయులుగానే ఉండిపోతారు.

ఏదియెలాగున్నా, ప్రభువుకు లోబడడంలో "ద్రాక్షల తొట్టిని ఒంటరిగానే త్రొక్కడానికి" కొందరు సిద్ధంగానే ఉన్నారు (యెషయా 63:3). తార్సువాడైన సౌలువలె, "–ప్రభువా, నే నేమి చేయవలెను?" అంటూ కొందరు కేకలు వేస్తారు (అపో. 22:10). వారు తమ వ్యాపారము కాని, లేక సాంఘీకపు అంతస్థుగాని లక్ష్యపెట్టక, జనులకు "వేడుకగా మారి," "లోకమునకు మురికిగాను అందరికి పెంటగాను" ఎంచబడడానికి సిద్ధపడ్డారు (1 కొరింథీ. 4:13బి). అది కేవలం వారి ప్రభువును ఆనందింపజేస్తూ, ఆయన చిత్తాన్ని జరిగించడానికి మాత్రమే చేస్తారు. అలాటి వారికి, నేను వ్రాస్తున్నాను.

మతశాఖల విధానం కొనసాగుతున్నంత కాలం పరిశుద్ధుల మధ్య ఏకత్వమనే రమ్యమైన ఫలితం ఎన్నడు రానేరాదు. దానిని ప్రోత్సహించేవాడు – ప్రభువైన యేసు ఏ మహిమాయుక్తమైన దానికొరకు ప్రార్థించాడో దాన్ని సాధించే ప్రతి ప్రయాసను అడ్డుకొంటున్నాడు. అలాటి వ్యక్తి మత ప్రపంచంలో మహా గొప్ప కీడును ప్రోత్సహించు తున్నాడు. దాన్ని గూర్చి ఆలోచించు: లోకంలో (హృదయమందు) అతి శ్రేష్ఠమైన ప్రజలు, దాన్ని చూచి చూడనట్టున్నారు – ప్రోత్సహించుతున్నారు, క్రీస్తు యొక్క పని లోకంలో విస్తరించకుండ బలపరచుతున్నారు కూడా. ఇలా ఎప్పుడైనా చేసి ఉంటే బహు కొద్ది విషయాలే యిలాటి (కీడును) చేసి ఉంటాయి.

మత శాఖలతో కూడిన సంఘాలన్నీ "విడిపోయి," వాటిలోనుండి యథార్థవంతులు "బయటికి వస్తే ఎంతో బాగుండు" (ప్రకటన 18:4 చూడు) అయితే నిజంగా మనం దాన్ని ఆశించలేం. మత శాఖల విధానం కొనసాగకుండ ఆపడానికి ఒకే మార్గముంది, అదేమంటే – దానివలన కలిగే కీడును యథార్థ హృదయాలు చూడగలగడమే. అలా చూచి, అప్పుడు దానిని విసర్జించి – పరిత్యజించి, క్రొత్త నిబంధన క్రైస్తవులు ఎట్టివారైయున్నారో, అలాటి వారుగానే ఉండిపోవాలి. మొదటి శతాబ్దపు క్రైస్తవులవలె నేడు కేవలం క్రైస్తవులుగానే ఉండాలంటే అర్థం – సంపూర్ణంగా పరిశుద్ధాత్మ వాక్కులచే

నడిపింపబడాలి. ఆయన లోకానికి వచ్చి (అపొస్తలులను) శిష్యులను సర్వసత్యంలోనికి నడిపించినప్పుడు – ఉపదేశము, పని, పరిచర్య, ఆరాధన అనేవి ప్రజలు చేసినట్టు యిప్పుడును జరగాలి. ఆనాటి పరిశుద్ధాత్మ పనిని నేడు ప్రజలలో మనం (నకిలీ కాదు) నకలు చేయగలగాలి. అప్పుడే మనం కూడా క్రొత్త నిబంధన బయలుపరచబడిన నాటి క్రైస్తవులంగా ఉంటాం. అలాటప్పుడు యిక మతశాఖలనేవి ఉండనే ఉండవు.

పరిశుద్ధాత్మ వచ్చి వారిని నడిపించేవరకు, లోకంలోనున్న జనులను రక్షణలోనికి నడిపించే పనికి ప్రభువు తన అపొస్తలులను పంపలేదు. అంతవరకు, "వేచి యుండుడని" మాత్రమే ప్రభువు వారికి ఆజ్ఞాపించాడు. పరిశుద్ధాత్మ వచ్చాడు. అప్పుడు ఆయన అపొస్తలులలోను, అపొస్తలులతోను ఉండి జరిగించిన కార్యాలను మనం పరిశీలిస్తున్నాం. నేటి క్రీస్తు యొక్క శిష్యులు పరిశుద్ధాత్మచే నడిపింపబడే దానికంటే ఎక్కువగా, తన ఆది శిష్యులు పరిశుద్ధాత్మచే నడిపింపబడాలని ప్రభువైన యేసు ఆతురత కనపరచాడా? ఆత్మయొక్క నడిపింపు లేకుండ తన పనిని జరిగించడానికి ఆయన వారిని పోనియ్యనప్పుడు, అదే ఆత్మ యొక్క నడిపింపు లేకుండ మనం వెళ్లడానికి ఆయన యిష్టపడతాడా? ఆది శిష్యులను నడిపించడానికి జరిగించిన ఆత్మ యొక్క పనిని ఎవడైనా విశ్వాసంతోను, హృదయ పూర్వకంగాను వెంబడించినట్టయితే, అతడు పరిశుద్ధాత్మ యొక్క నడిపింపును వెంబడిస్తున్నాడు. వాస్తవానికి, మనకు తెలిసినంతమట్టుకు, పరిశుద్ధాత్మచేత నడిపింపబడడానికి అది ఒక్కటే మార్గం.

ఆయన వారితో చేసిన పని మనకు మాదిరిగాను, మనకు మార్గదర్శిగాను ఉండవలసియుంది. మరియు మన పని దైవికమైన నమూనాకు నమ్మకముగా ఉండవలసి యుండగా, ఆ పనిలోని ప్రతి భాగాన్ని మనం పూర్ణ మనస్సాక్షితోను, జాగరూకతతోను పరిశీలించవలసి ఉంటుంది. ఈ తొలి పని ప్రభువైన యేసును గూర్చి ప్రకటించడం, వినడం, రూఢిగా తెలిసికొనడం, మారుమనస్సు పొందడం, బాప్తిస్మం పొందడంతో కూడియుంది. యేసు యొక్క పునరుత్థానం తరువాత వచ్చిన తొలి పెంతెకొస్తు దినాన, పేతురును అతని శ్రోతలును పరిశుద్ధాత్మ నడిపింపును అనుసరించినట్టే, ఆ మాదిరిని అనుసరించేవాడు అదే నడిపింపును అనుసరిస్తున్నాడు. అలాటి సువార్తికుడు క్రొత్త నిబంధనలో బయలుపరచిన విధంగానే యేసును గూర్చి ప్రకటిస్తాడు. సిలువ వేయబడిన యేసు ప్రభువుగాను, క్రీస్తుగాను ప్రకటింపబడినట్టు నిశ్చయంగా తెలుసుకోవాలని కోరతాడు; దాన్ని ఎరిగినవారిని మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మం పొందమని కూడా ఆజ్ఞాపిస్తాడు. ఆయా మతశాఖల సిద్ధాంతాలను కాక అతడు కేవలం బైబిలు సిద్ధాంతాలనే ఉపదేశిస్తాడు. అలాటి సువార్తికుని మతశాఖలకు సంబంధించిన ఏ బిరుదుతోనైనా గుర్తించడం, ఆ మనిషినీ ప్రభువు యొక్క సిద్ధాంతాన్నీ తప్పుగా సూచించడమే ఔతుంది.

పరిశుద్ధాత్మ యొక్క ఈ స్పష్టమైన మాదిరితో, సువార్తను ప్రకటించడం, లోకాన్ని రక్షణలోనికి నడిపించడం అనే పనిలో నిజమైన హృదయాలు ఎలా విభజింపబడతాయి? మాదిరి స్పష్టంగా ఉందా? మనం దాన్ని అనుసరించగలమా? అది తరచూ పయనించిన మార్గమంత స్పష్టంగా ఉంది. విద్యలేనివారు, పండితులు కానివారు అర్థం చేసికొనేలా

దాన్ని వ్యాఖ్యానించడానికి ఏ ప్రవక్తో, యాజకుడో, లేక సువార్తికుడో అవసరం లేదు. దాన్ని చదివినవాడెవడైనా గ్రహించుకోగలిగినంత స్పష్టంగా ఉంది. సత్యాన్ని అన్వేషించే హృదయాలు తికమకపడేలాగునను, యేసు రక్తం అపార్థం చేయబడేలాగునను పరిశుద్ధాత్మ పలకడం సాధ్యమా? వేరైన వర్గాలుగా మారునంత అయోమయంగా ఆత్మ యొక్క బోధ ఉందంటావా? ఏక మనస్సు ఏక తాత్పర్యం కలిగియుండుడని ప్రభువు కోరుతూ ఉండగా, ప్రతి ఒక్కరు తన సొంత వర్గాన్ని కట్టకుండా ఆత్మ బోధ స్పష్టంగా లేదంటావా? ఇంతకు తప్పు ఎక్కడుంది? హృదయాలు ఆయనను అర్థం చేసికొనకుండేలా పరిశుద్ధాత్మ బోధించి యుండినట్టయితే, అప్పుడు పరిశుద్ధాత్మ మనకు చేసిన విన్నపాలు తప్పక వ్యర్థమై ఉండాలి.

పేతురు బోధించగా విన్న ప్రజలు రక్షింపబడింది బాప్తిస్మానికి ముందా లేక తరువాతనా? మార్గంలో యిక్కడ ఒక ముండ్ల గరిటె ఉంది. ఇక్కడ సత్యమైన సహృదయాలు వేరుచేయబడతాయి. అది అవసరమా? ఈ పాయింటు వద్ద పెంతెకొస్తు దినాన బాప్తిస్మం పొందిన మూడువేల మంది ఏకంగా ఉన్నారా? లేక అసమ్మతితో ఉన్నారా? ఆ కూడిక అయిపోయిన పిమ్మట, బాప్తిస్మం పొందక ముందు రక్షింపబడిన ఒక గుంపు, బాప్తిస్మం పొందిన తరువాత మరియొక గుంపు అన్నట్టు జనులు విభాగింపబడ్డారా? లేదు. అలాటిది అక్కడ ఏమీ లేదు, మరియు అలాటి విభజన ఏదీ లేదని ప్రతివానికి తెలుసు. ఎందుకు లేదు? లోకమంతటినుండి వచ్చిన ప్రజలు అక్కడ కూడియుండలేదా? వారు వివ్విధమైన భాషలు మాటలాడలేదా? మరియు వ్యత్యాసమైన ప్రభావముల క్రిందను వేరైన వాతావరణములలోను వారు పెంచబడి యుండలేదా? మరోవిధంగా చెప్పాలంటే, నేటి ఏ శ్రోతలవలనైనా వారు ఉద్రేక స్వభావంలోను, గుణగణాలలోను, ఇంటి ప్రభావాల్లోను, చిన్నతనపు తర్ఫీదులోను వ్యత్యాసమైనవారుగా ఉండలేదా? ఏదియేమైయున్నా, "పాపక్షమాపణ నిమిత్తము … బాప్తిస్మము పొందుడని" పేతురు చెప్పినతోడనే (అపొ. 2:38), ఆ గొప్ప శ్రోతల సమూహంలోని ప్రతి ఒక్కనికి పేతురు యొక్క మాటలు అర్థమయ్యాయి. మనం ఎందుకు అర్థం చేసికోలేము? వారికి మనకు గల వ్యత్యాసమేమి? పేతురు యొక్క ఉపదేశము మనకు తర్జుమా చేయబడింది వాస్తవమే. అయితే మన తర్జుమా సత్యమేనా? పేతురు యొక్క మాటలు తెలుగులోనికి మార్చినందున గ్రహించడం కష్టమయ్యిందా?

మరో విధంగా చెప్పాలంటే, నా ప్రియమైన స్నేహితులారా, "పాపక్షమాపణ నిమిత్తము" అనేదానిలో "నిమిత్తము" అనే మాటను యథార్థ హృదయాలు అపార్థం చేసికోవలసి వచ్చిందని నమ్ముతావా? అందును బట్టి రెండుగా విడిపోయి, దేవుని ప్రజల మధ్య విభజనలు ఏర్పడాలా? తనయందు విశ్వాసముంచువారందరు ఏకమైయుండాలనే ప్రభువు యొక్క ప్రార్థనను యిందును బట్టియే తృణీకరించాలా? "నిమిత్తము" అనే ఆ చిన్న పదం యింతటి నానార్థాలు యిచ్చేదిగా తప్పక లేదు. ఆ చిన్న పదం యొక్క అర్థము కథను చెప్తుతుంది. ఆ లేఖన భాగం యొక్క అర్థానికి అదే కీలకమైయుంది. "మనం ఎప్పుడు రక్షింపబడ్డాం – బాప్తిస్మానికి ముందా లేక [బాప్తిస్మానికి] తరువాతనా – అనే ప్రశ్న మీద మత ప్రపంచంలో గొప్ప విభజన ఉందని ఒకరు చెప్పవచ్చు – [కాని]

‘నిమిత్తము’ అనే మాట యొక్క భావం మీద మాత్రం తప్పక కాదు.” బహు నిశ్చయంగా యిది వాస్తవం. నిజానికి, విభజనకు ఏ సాకూ లేదు. మనమందరం ఏకమైయుండాలనే మన రక్షకుని విన్నపాన్ని – మనం పూర్తిగా నిర్లక్ష్యం చేస్తున్నంతవరకు మతశాఖల తత్వం కొనసాగుతుంటుంది.

పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మం పొందుడని పేతురు ఆ ప్రజలతో చెప్పినప్పుడు, ఒక ముఖ్యమైన భావంతో బాప్తిస్మము పాపక్షమాపణ అనేవాటిని అతడు జతచేశాడు అతని భావమేమి? తరువాత పాఠంలో దాన్ని మనం చూద్దాం.